# 6. తెలుగు సాహిత్యంలో భవిష్యద్దర్శనం

భారతదేశంలో ప్రాచీన సంప్రదాయ కవిత్వం మత ధర్మాన్ని నెలకొల్పే సాహిత్యంగా వెలువడింది. ఆ కాలం నాటి రచనలలో ముఖ్యంగా మహాభారత, రామాయణం, పురాణాలు, కాలజ్ఞానం మొదలైన రచనలలో భవిష్యద్దర్శనం సామాజికాంశాలను, రాబోయే కలియుగ లక్షణాలను భవిష్యద్దర్శనం చేస్తూ భక్తి మార్గమే దీనికి పరిష్కారం అని సూచించటం కనిపిస్తుంది. శకునాలు, కలలు, ఆశీర్వచనాలు, శాపాలు, సాముద్రిక లక్షణాలు, యోగ బలం, జాతక బలం మొదలైన అంశాల ప్రాబల్యంతో భవిష్యద్దర్శనం సూచింపబడింది.

## 6.1 రామాయణం - భవిష్యద్దర్శనం

సీతారాముల వివాహానంతరం దశరథుడు బంధుమిత్రులు, మునులను తోడ్కొని అయోధ్య నగరానికి బయలుదేరుతాడు. మార్గమధ్యంలో దశరథునికి కొన్ని శకునా లెదురవుతాయి.

"పక్షులు గూసెను రూక్షత
నక్షత్ర పథంబునంగనర్ మృగసంఘం
బాక్షణమ పాఱఁ దొడఁగెఁబ్ర
దక్షిణముగ దానిఁ జూచి దశరథుఁడార్తిన్" [1]

పరుషధ్వనులతో ఆకాశంలో పక్షులు కూసాయి, మృగాలు ప్రదక్షిణంగా

1. శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము, బాలకాండము, అనువాదం – వావిలికొలను సుబ్బారావు, శ్రీ కొండన్న రామసేవక ధర్మ సమాజము, తెనాలి, 1964, పద్యం 1308, 1309, పుట 958, 959.

పరుగెత్త సాగాయి. ఇలా ఆకాశంలో అపశకునాలు భూమి మీద శుభ శకునాలు కనబడగా చూసి దశరథుడు పరితాపంతో

"అడిగె వసిష్ఠు నేమియది యంచు, మునీంద్రుడు పక్షి కూతలన్
బెడిద వుఁగీడు దోఁచినను బెగ్గిలపోకు ప్రదక్షిణించె నీ
యడవి మృగంబు, లట్లగుట నాపద లేదనుచుండనంతలో
సుడిసుడి గొట్టె వాయువులు చూపఱగుండెలు ఝల్లుఝల్లనన్" [1]

వసిష్ఠునిఁ జూసి ఇది ఏమిటని అడుగగా, పక్షి కూతలవల్ల ఏదో భయంకరమైన కీడు గలుగబోతుందని, అయినా భయపడవలసిన కారణం లేదని అడవి మృగాలు ప్రదక్షిణంగా పోతున్నాయి. కాబట్టి ఆపద కలుగదని వివరాలు విడమరచి చెప్పాడు. సుందరకాండ 27వ సర్గలో త్రిజట సీతకు కాపలదారులుగా ఉన్న రాక్షస స్త్రీలతో రాముడికి జయం కలుగుతుందని సీతను తీసుకొనిపోతాడనే స్వప్న వృత్తాంతాన్ని 34 శ్లోకాలలో వివరిస్తుంది.

## 6.2 మహాభారతం - భవిష్యద్దర్శనం

### 6.2.1 ఉద్యోగ పర్వం - కురుక్షేత్రయుద్ధం

ధృతరాష్ట్రుడు సంజయుడిని పాండవుల వద్దకు రాయబారానికి పంపుతాడు. కౌరవుల సందేశాన్ని పాండవులకు తెల్పిన సంజయుడు తిరిగి కౌరవుల వద్దకు వస్తాడు. మరునాడు కౌరవుల సభలో సంజయుడు ధృతరాష్ట్రునితో పాండవుల అభిప్రాయాలను తెల్పుతాడు. ధృతరాష్ట్రుడు భీమసేనాదుల బలాలను విని భయకంపితుడవుతాడు. అతని భయాన్ని

1. శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము, బాలకాండము, అనువాదం - వావిలికొలను సుబ్బారావు, శ్రీ కొండన్న రామసేవక ధర్మ సమాజము, తెనాలి, 1964, పద్యం 1308, 1309, పుట 958, 959.



పోగొట్టడానికి దుర్యోధనుడు తనవైపున్న వారి బలాలను ప్రస్తుతించాడు. సంజయుడు పాండవ దివ్యశక్తులను వివరించాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు కౌరవ వీరులు అసాధ్యులు కదా! వీరిని ఎట్లా సాధించగలమని పాండవులు భావిస్తున్నారో తెల్పమని అడిగాడు. సంజయుడు ఇట్లా బదులు చెప్పాడు.

సీ. గంగాసుతుండు శిఖండి పాలతనికిఁ
బ్రాపు మత్స్యేశ్వరు బలము కుంభ
భవుడు ధృష్టద్యుమ్ను పాలతనికిఁదోడు
పడు ద్రౌపదీ పుత్ర పంచకంబు
రారాజుఁదమ్ములు మారుతిపాలు కు
మారులందఱు నభిమన్యుపాలు
శకుని సైందవులు నశ్వత్థామ కర్ణులుఁ
దక్కొరుచే బోని దండిమగలు

ఆ. సవ్యసాచి పాలు సాత్యకి పాలో కృత
వర్మ చేకితాన వసుమతాశు
పాలు సోమదత్తు డాలంబునకు నిట్లు
నిశ్చయించిరచట నృపవరేణ్య. [1]

ధృతరాష్ట్ర మహారాజా ! భీష్ముడు శిఖండి వంతు. ఆ శిఖండికి విరాటుడి సైన్యం అండ. ద్రోణుడు ధృష్టద్యుమ్నుడి వంతు. అతడికి ఉపపాండవులైదుగురూ తోడ్పడతారు. దుర్యోధనుడూ అతడి తమ్ములు భీముడు వంతు. యువ వీరులంతా అభిమన్యుడి వంతు. కృతవర్మ సాత్యకి వంతు. సోమదత్తుడు చేకితానుడనే యాదవరాజు వంతు. యుద్ధానికి ఇట్లా అక్కడ

1, ఆంధ్ర మహాభారతం, ఉద్యోగపర్వం, ద్వితీయాశ్వాసం, పుట 229, 459.

నిశ్చయించుకొన్నారు.

కం. నకులుడు, సహదేవుఁడును
శకుని నులూకాదిసుతుల సారస్వతులం
బ్రకట బలులైన కాళిం
గకులను సమయించువారు కౌరవనాథా [1]

ధృతరాష్ట్ర మహారాజా! నకుల సహదేవులు శకునినీ, ఉలుకుడూ మొదలైన కొడుకులను, సారస్వతులనూ, ప్రసిద్ధమైన బలం కల కాళింగకులనూ చంపుతారు.

కం. కేకయులు మనలఁగలసిన
కేకయుల జయించువారు; కృత పుణ్యుడసు
శ్లోకుడు ధర్మతనూజుఁడు
లోకోత్తరు శల్యుఁదా గెలుచువాఁడధిపా ! [2]

రాజా! కేకయులు మనలను కూడిన కేకయులను జయిస్తారు. పుణ్యాత్ముడు సుశ్లోకుడు అయిన ధర్మరాజు లోకోత్తరుడైన శల్యుడిని గెలుస్తాడు.

పాండవులు కురుక్షేత్ర యుద్ధంలో యుద్ధ వ్యూహాన్ని ముందే నిర్ణయించి విజయ సాధనని గురించి సంపూర్ణ విశ్వాసం గలిగి సమీప భవిష్యత్తును గుర్తెరిగి ఉన్నారనే విషయం విశదమవుతుంది.

### 6.2.2 భీష్మపర్వం

త్రికాలవేది అయిన వ్యాస భగవానుడు జరగబోయే సంగ్రామంలో భరత కుల వృద్ధుడైన భీష్ముడు మొదలైనవారు మరణించబోతున్నారని, అఖిల జనం క్షయమొందుతుందని, కురు కుల వినాశనం కానున్నదని తెలిసినవాడు. పుత్రులను గురించి శోకిస్తున్న ధృతరాష్ట్రుడితో నీ కుమారుల యుద్ధం కళ్ళారా

1 & 2 ఆంధ్ర మహాభారతం, ఉద్యోగపర్వం, ద్వితీయాశ్వాసం, పుట229, 459.



చూడదలచుకుంటే నేత్రదృష్టి ప్రసాదిస్తానంటాడు. ధృతరాష్ట్రుడు నేనది చూడలేను నాకు తెలిసేటట్లు చేయవలసిందని ప్రార్థించగా వ్యాసుడు ఆ వరాన్ని సంజయునికి ప్రసాదిస్తాడు. ప్రకాశమైనా, అప్రకాశమైనా, పగలైనా, రాత్రయినా యుద్ధ విశేషాలు, వ్యక్తుల మనోగత అభిప్రాయాలు తెలుసుకోగలుగుతాడు. దివ్యదృష్టితో యుద్ధం యావత్తు చూసి చెప్పగలడని వ్యాస మునీంద్రుడు అనుగ్రహిస్తాడు. ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ జయం కలుగుతుంది. ఈ యుద్ధంలో మహాక్షయం కలుగనున్నది. అందుకు భయంకరమైన దుర్నిమిత్తాలు సూచింపబడుతున్నాయి అని వ్యాసుడు పలికాడు.

వాతావరణంలో మార్పులు రాత్రి పగలు అనే భేదం లేకుండా సూర్యచంద్రులు నక్షత్రాలు కనిపిస్తూ ఉండడం మహాభయాన్ని సూచిస్తున్నాయి. దేవాలయాలలో విగ్రహాలు కదులుతూ, నవ్వుతూ, రక్తం కక్కుతూ, అకారణంగా జరిగిపోతున్నాయి. మేఘాలు లేకుండానే ఉరుములు వినవస్తున్నాయి అని కలగబోయే క్షయాన్ని ముందుగానే తెలుసుకున్నాడు.

ఏనుగులూ, గుఱ్ఱాలూ కన్నీరు కారుస్తున్నవి. స్త్రీలకు భయంకరమైన బిడ్డలు పుట్టనున్నారు. ఒకేసారి నలుగురు, ఐదుగురు బిడ్డలు జన్మించనున్నారు. అరుంధతి వశిష్టుని వెనుకకు నెట్టివేస్తున్నది. 14, 15 రోజులలో వచ్చే అమావాస్య పదమూడు రోజులకే వచ్చిందని సూర్యచంద్రులు గ్రస్తులైనారు. గోవులకు గాడిదలు పుట్టనున్నాయి. ఈ దుశ్శకునాలన్నీ నానాదేశ వాసుల నాశనాన్ని కులక్షయాన్ని సూచిస్తున్నాయి. శుభ శకునాలు ఎవరి పక్షాన ఉంటాయో వారిదే విజయం.[1]

యుగధర్మాలను చెపుతూ కలియుగంలో మానవుల ఆయుః ప్రమాణం చెప్పడం కష్టం. కొందరు గర్భంలో ఉండగానే మరణిస్తారు. కొందరు పుట్టిన

1. వచన మహాభారతం, భీష్మద్రోణపర్వాలు, రెంటాల గోపాలకృష్ణ, విజయవాడ, 1999, పుట 7.

కొద్ది కాలంలోనే చనిపోతారు. కృతయుగంలో మానవులు ధార్మికులు, మహాసత్వ గుణ సంపన్నులు, మహాత్ములు, తపోధనులు, సత్యవాదులు, మహావీరులు. త్రేతాయుగంలో శ్రేష్ఠులు, ఆయుష్మంతులు, చక్రవర్తులు జన్మిస్తారు. ద్వాపరయుగంలో అల్పతేజస్కులై, పరస్పర జయకాంక్షులై, పోరు చేసేవారుగా ఉంటారు. కలియుగంలో మానవులు అసత్యవాదులు, అసూయాపరులు, లోభులు, తీవ్ర కోపులుగా ఉంటారు. [1]

**ఆశీస్సులు**

అర్జునుడు దుర్గను స్తుతించగా దుర్గాదేవి శీఘ్రకాలంలో నీవు యుద్ధంలో జయం పొందగలవని ఆశీర్వదించింది. అర్జునుడు శ్రీకృష్ణుని రూపాన్ని చూడాలనుకున్నపుడు చర్మచక్షువులతో కాంచలేని రూపాన్ని దివ్యదృష్టితో విశ్వరూపాన్ని చూడగలుగుతాడు. [2]

**6.2.3 అరణ్య పర్వం**

మహాభారతం అరణ్యపర్వంలో మార్కండేయుడు ధర్మరాజుకు ప్రళయ ప్రకారాన్ని వివరిస్తాడు. ప్రళయ కాలానికి వేయేండ్ల పూర్వం నుండే లోకంలో అధర్మం పెరుగుతుంది.

లోకంలో ధర్మపరాయణులుండరు.

జనులు విధ్యుక్త స్వధర్మాలను వదులుతారు

జనులలో సూనృత వాక్కు లరుదగును.

స్త్రీలు భర్తలను మెచ్చక స్వచ్ఛందులై అన్యపురుషులతో విహరిస్తారు.

వ్రతాలకు యజ్ఞాలకు మారు కర్మలనాచరిస్తారు.

వర్ణాశ్రమ ధర్మాలు అడుగంటుతాయి.

---

1 & 2 వచన మహాభారతం, భీష్మ పర్వం, రెంటాల గోపాలకృష్ణ, 1999, పుట12,13,29.



సూర్యుడు చండాంశువులతో వేడి ఎండలతో సర్వసముద్ర నదీ జలాలను కృశింపజేస్తాడు.ఎండ వలన సర్వ ఔషధులు, వృక్షాలు, లతలు సారహీనమై భస్మీభూతమవుతాయి. మేఘాలు చెవులు చిల్లులు పడేట్టు ఉరిమి, వానకురిసి, అగ్నిని చల్లార్చి, నేలంతా జలమయమై మునిగిపోతుంది. చండమారుతం వీస్తుంది. వానలు లేక కాటకాలేర్పడి జంతువులన్నీ నశిస్తాయి.

మార్కండేయుడు కలికాల మహిమను ధర్మరాజుకు వివరిస్తాడు. కలియుగంలో ధర్మాన్ని వీడి ప్రజలు ప్రశంసార్థాది వ్యాజాలతో చూస్తారు.

సత్యాన్ని వీడి కపట వర్తనులవుతారు.

ఆయుస్సు తరుగుటవల్ల బహువిద్యలను నేర్వరు. అల్ప విద్య వలన అజ్ఞానం బలీయమవుతుంది.

దానలోభం, క్రోధం, కామం, మాత్సర్యం, పాపాచరణ అధికమవుతుంది.

వర్ణ సంకరం ఏర్పడుతుంది.

సుగంధ ద్రవ్యాలలో గంధం తరుగుతుంది.

సర్వజీవులు, ఔషధులు రసహీనమవుతాయి.

రసవంతమైన వస్తువులు నీరస రుచి హీనులవుతాయి.

గోవుల పాడి అత్యల్పమై మేకల గొఱ్ఱెల పాడి హెచ్చుతుంది.

ఫలసమృద్ధి ఉండదు. కాల వర్షాలు కురవవు.

పండిన నేలలను ఫలవృక్షాలతో ఒప్పారు తోటలను చెరచి వేస్తారు.

బహు ప్రయాసచే అల్పఫలాలను పండిస్తారు.

వృద్ధులు జడమతులవుతారు. వారికి బాలురు బోధకులవుతారు.

బాలురు విశేషజ్ఞానులవుతారు.

కన్యాదాన క్రియా కలాపాదులు లేక తమ కిష్టమొచ్చిన స్త్రీలను పురుషులు గ్రహిస్తారు.

పుత్రులు తండ్రులను తల్లులు కన్నశిశువుల కుత్తుక నులుముతారు.

జనులు వేదాలను నిందిస్తారు.

ఆశ్రమ ధర్మాలు క్షీణిస్తాయి.

శిష్యులు గురువులను తిరస్కరించటం గురువులు శిష్యుల విషయంలో కపటంతో వర్తించటం జరుగుతుంది.

దేశమెల్ల మ్లేచ్ఛా క్రాంతమవుతుంది.

ఈ విధంగా లోకంలో తీరుతెన్నులు లేక విపరీతపు నడకతో అంతటా అధర్మం ప్రాకగా అధర్మాన్ని అణచటానికి ధర్మాన్ని ఉద్ధరించటానికి విష్ణుదేవుడు శంబల గ్రామంలో విష్ణుయశుడనే బ్రాహ్మణునికి కల్క్యవతారియై పుడతాడు. అతడు మ్లేచ్ఛులను వధించి, న్యాయమార్గంలో దిగ్విజయం పొంది, ధర్మస్థాపన గావిస్తాడు. మళ్ళీ వర్ణాశ్రమ విభాగాలు సక్రమంగా వర్ధిల్లుతాయి.

## శాపం

మహాభారతం (ఆరణ్యపర్వం) దుర్యోధనుడు మైత్రేయుని శాపఫలితంగా భీముని చేతిలో మరణిస్తాడు. పాండవులతో మైత్రి చేయమని మైత్రేయుడు బోధించగా చేతులతో తొడలు చరచి, బాహువులు పైకెత్తి, కాలి బోటన వ్రేలితో నేలపై రాస్తూ నిర్లక్ష్యం ప్రదర్శించాడు. మహర్షి కోపించి రాబోయే యుద్ధంలో భీముడు తన గదతో నీ తొడలు విరుగ గొడతాడు అని శపించాడు.

సావిత్రి మద్ర దేశాధిపతి అశ్వపతి కుమార్తె. ఆమె సాళ్వదేశాధిపతి అయిన ద్యుమత్సేనుడి కుమారుడు సత్యవంతుని తనకు తగిన వరునిగా నిశ్చయించుకుంటుంది. సావిత్రి తాను సత్యవంతుడిని వివాహమాడుతానని తండ్రికి తెలిపింది. అశ్వపతి సత్యవంతుడి గుణశీలాలను గురించి విచ్చేసిన నారదుడిని అడిగాడు. ఆ మహర్షి ఇలా చెప్పాడు “ఎల్లప్పుడూ సత్యం పలకటంచేత సత్యవంతుడు సార్థకనామధేయుడయ్యాడు. అతనికి చిత్రాశ్వుడనే రెండో పేరు ఉంది. తేజస్సులో



సూర్యుడిని, బుద్ధిలో బృహస్పతిని, పరాక్రమంలో ఇంద్రుడిని, ఓర్పులో భూమిని, కాంతిలో చంద్రుని, అందంలో అశ్వనీ దేవతలను పోలి ఉంటాడు. అంతవాడిలో ఒక దోషం కూడా ఉన్నది అంటూ ఇలా అంటాడు.

వ. ‘వాని యందు గీడొక్కటి గలదు. పరిణయంబు
మొదలుగానొక్క సంవత్సరంబు
నకు మృతింబొందు. నిది నీకు
జెప్పవలయుటంజేసిచెప్పితిని’[1] అంటాడు.

అది విని అశ్వపతి సావిత్రితో వేరే వరుడిని అన్వేషించు అని తెల్పుతాడు. సత్యవంతుడు ఎలాంటివాడైనా అతడిని వివాహం ఆడుతానంటుంది సావిత్రి. అప్పుడు నారదుడు

చ. గౌనముల ప్రోకనీయనుఁగుఁగూతురు దీని తలంపు మాన్పఁగా
మనకు నశక్యమింక ననుమానము లేల? నరేంద్ర! కూతుఁజ
య్యననృప సూతికిమ్ము; కమలానన చేసిన పుణ్య గౌరవం
బున నయినంబ్రియుండు పరిపూర్ణ చిరాయురు పేతుఁడయ్యెడున్ [2]

సావిత్రి చేసిన పుణ్యం వలన ఆమె భర్తకు నిండు ఆయుర్దాయం లభించగలదు అని నారదుడు పలికిన మాటలను సావిత్రి తన పతివ్రతాధర్మం చేత భర్తను కాపాడుకుంటుంది.

## శకుంతలోపాఖ్యానం

కణ్వ మహాముని ఆశ్రమంలో శకుంతలను దర్శించిన దుష్యంతుని మనస్సు ఆమె యందు లగ్నమవుతుంది. మేనక విశ్వామిత్రుల కుమార్తె శకుంతల అని తెలిసిన తర్వాత ఆమెను గాంధర్వ విధిని వివాహమాడతాడు.

---

1 & 2 ఆంధ్ర మహాభారతం, అరణ్యపర్వం, సప్తమాశ్వాసం, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు, పుట 182,185.

ఆమెకు పుట్టిన పుత్రుడికి యౌవరాజ్య పట్టాభిషేకం చేస్తానని మాట ఇచ్చి వెళ్ళిపోతాడు. ఆశ్రమంలో శకుంతల తాను చేసిన పనికి కణ్వమహర్షి తెలిసికొని కోపగిస్తాడేమో అని భయపడుతూ ఉండగా అప్పుడు కణ్వమహర్షి కందమూలాలను, పండ్లను కోసుకొని వనం నుండి తిరిగి వచ్చి సున్నితమైన శృంగార హావభావాలతో సిగ్గుతో తలవంచుకొని భయపడుతూ ఉన్న తన కూతురు శకుంతలను చూసి దివ్యజ్ఞానంతో జరిగిన కథనంతా తెలుసు కొన్నాడు. 'క్షత్రియులకు గాంధర్వవివాహం శాస్త్ర సమ్మతమే' అని సంతోషించి శకుంతలతో ఈ విధంగా అన్నాడు.

తే. 'తల్లి! నీ కులగోత్ర సౌందర్యములకుఁ
దగిన పతిఁగంటి; దానికి దగఁగ గర్భ
మయ్యె; నీదు గర్భమున వాఁడఖిల భువన
వహన మహనీయుఁడగు చక్రవర్తి సుమ్ము' [1]

అని శకుంతలకు కలగబోయే పుత్ర సంతాన భాగ్యాన్ని, చక్రవర్తి అవుతాడనే విషయాన్ని, దివ్యజ్ఞానంతో జరిగిన వృత్తాంతాన్ని జరగబోయే వృత్తాంతాన్ని తెలుసుకుంటాడు.

## 6.2.4 కర్ణపర్వం

పరశురాముని శాపం వల్ల, బ్రాహ్మణుని శాపం వల్ల కర్ణునికి భార్గవాస్త్రం, బ్రహ్మాస్త్రం ఆపత్సమయంలో ప్రయోగించాలని తోచదు. అస్త్రం స్థిరంగా ఉండదని, స్ఫురించదని శపించాడు. హోమధేనువు వత్సాన్ని బాణంతో కొట్టినందుకు ఎవరిని

1. ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం, చతుర్థాశ్వాసం, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, పుట 93



గెలవాలని యుద్ధం చేస్తావో అతని చేతుల్లోనే నీ చావు మూడుతుందని బ్రాహ్మణుడు శపించాడు. శాపవశాత్తు జరగబోయే విషయాలను ముందుగానే తెలియజేయడం కనిపిస్తుంది. కుల ధర్మాన్ని పాటించనందుకు కర్ణుడు శాపానికి గురవుతాడు.

## 6.2.5 శల్యపర్వం

త్రితుడు దుష్టబుద్ధులైన సోదరులను రౌద్రమైన వృకరూపాలు పొందమని శపించాడు. ఏకతుడు, ద్వితుడు వృకాలుగా మారారు.

చంద్రుడు రోహిణి యందు అధిక అనురక్తుడవటం వలన 27 మంది పుత్రికలనిచ్చి వివాహం చేసిన దక్ష ప్రజాపతి కుపితుడై రాజ యక్ష్మరోగ పీడితుడవు కమ్మని శపించాడు.

సరస్వతీ తీర్థ జలాలలో మునిగితే నెలలో 15 రోజులు వృద్ధి పొందుతూ ఉంటాడని దక్ష ప్రజాపతి శాపానికి గురయ్యాడు చంద్రుడు.

మత గ్రంథాలలో శాపాల ప్రస్తావన కనిపిస్తుంది. మునులు రాజులను శపించటం, త్రిమూర్తులు దేవతలను శపించి శాపవిమోచనాన్ని సూచించటం భారత, పురాణ గాథలలో సాధారణంగా కనిపిస్తుంది. మత విశ్వాసాలు, నమ్మకాలు జానపదుల కాలంనుండి ఉన్నటువంటిది.

# 6.3 పురాణాలు - భవిష్యద్దర్శనం

మిత్రుల వలె కర్తవ్యాకర్తవ్యాలను కథోపాఖ్యానాల మూలంగా బోధిస్తాయి. కాబట్టి లాక్షణికులు పురాణాలను మిత్ర సమ్మితాలని పేర్కొన్నారు. పురాణాలు పద్దెనిమిదని పేర్కొన్నారు*.

భద్వయం మద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయం
అనాపలింగ కూస్కాని పురాణాని ప్రచక్షతే.

భాగవత, భవిష్య, వామన, వాయు, విష్ణు, మత్స్య, మార్కండేయ, బ్రహ్మండ, బ్రహ్మవైవర్త, బ్రహ్మ, వరాహ, అగ్ని, నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కాంద పురాణాలు.

### 6.3.1 బ్రహ్మ వైవర్త పురాణం

లోక కళ్యాణంకోసం భవిష్యత్తులో నూరు కోట్ల కల్పాల తరువాత దుర్గను అర్ధాంగిగా స్వీకరించమని శివునికి శ్రీకృష్ణుడు (బ్రహ్మఖండం ఆరవ అధ్యాయం) ఆదేశించాడు.[1] శ్రీ మదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణం ప్రకృతి ఖండం ఆరవ అధ్యాయంలో కలియుగ భవిష్య చరిత్ర గురించి పేర్కొన్న అంశాలను ఈ విధంగా వర్గీకరించి పరిశీలించ వచ్చు.

**మతం:** తులసీదళాలు లేకుండ పూజలు చేస్తారు. ఏకాదశీవ్రత విహీనులై అందరు ధర్మవివర్జితులవుతారు.

ప్రజలు హరి విప్ర సంఘ విముఖులై అజ్ఞానులై ప్రవర్తిస్తారు.

సంధ్యావందనం యజ్ఞోపవీత సంస్కారాలను పాటించక ప్రజలు మ్లేచ్ఛుల్లా వ్యవహరిస్తారు.

ద్విజులు పంచ యజ్ఞాలు ఆచరించరు. యజ్ఞోపవీతాలను కూడ ధరించరు.

---

1. శ్రీ మదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణము, ప్రకృతి ఖండము, ఏడవ అధ్యాయము, పుట 65 – 68.



మానవులు భగవన్నామాన్ని, భగవంతుని ప్రసాదాన్ని విక్రయిస్తారు.

**ప్రజలు:** స్వశాస్త్రాలను మ్లేచ్ఛ శాస్త్రాలను పఠిస్తారు.

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు సర్వులు సేవకులై జీవిస్తారు.

**పాలకులు:** భగవంతుడే ఇష్టానుసారం ప్రవర్తింపగలడు.

పాలకులు ప్రతాపహీనులై ప్రజలను వివిధ పన్నులతో పీడిస్తారు.

పాలకులు తేజోహీనులై, భగవద్భక్తి శూన్యులై, నాస్తిక రాజ్యాలను స్థాపిస్తారు.

అడవులలో నివసించే ప్రజలుసహితం పాలకుల పన్నులభారం వహిస్తారు.

**స్త్రీ పురుష సంబంధాలు:**

పురుషులు స్త్రీలకు లోబడి జీవిస్తారు.

గృహపత్నులు గృహానికి యజమానురాలై భర్తను సేవకుని కంటె అధముడిగా పరిగణిస్తారు.

సుశీల వ్రతులైన పతివ్రతలు అరుదు.

**వివాహం:** వివాహాది దివ్య కర్మలందు ప్రజలు సరకు చేయక యథేచ్ఛగా ప్రవర్తించగలరు.

దంపతులు పరస్పర ప్రీతి హీనులవుతారు.

గృహస్థులకు సుఖములు లభించవు.

ఇంటింట్లో కులటలు ఉద్భవిస్తారు. వీరు దురాచారపరులై కటుభాషణాలతో నితరుల మనస్సులను చివరకు తమ భర్తలను నొప్పిస్తారు.

**మైత్రి:** మానవులలో పరస్పర మైత్రి లుప్తమవుతుంది.

ఉత్తమ స్నేహితులు లభించరు.

**బంధువు:** రక్త సంబంధం కలవారే బంధువులవుతారు.

మానవుడు దూరబంధువులను, ఆచార్యులను, మిత్రులను విస్మరిస్తాడు.

సర్వజనులు సత్యహీనులై చరించగలరు.

**సమాజం:** అందరూ వామాచార రతులవుతారు. మద్యమాంసాదులు సేవిస్తారు.

అసత్యం కపటాచారాలంటే ఎవరికీ ఏహ్యభావం ఉండదు.

శఠం, క్రూరత్వం, డాంభికం, అహంకారం, చౌర్యం, హింసాకాండం, మాత్సర్యం, కామం, క్రోధం మొదలైన దుర్గుణాలు ప్రపంచమంతా వ్యాపిస్తాయి.

వారు యుద్ధోన్ముఖులై హింసను ప్రోత్సహిస్తారు.

స్వపరస్వామి భేదం సహితం లుప్తం కాగలదు. పెద్ద చిన్న భేదం నశిస్తుంది.

మానవులు అశ్లీల భాషాయుక్తులై, ధూర్తులై, శఠులై, అసత్యవాదులై జీవింపగలరు.

దుర్వచనాలు పలుకుతూ ప్రజలు దుష్ట వ్యవహారాలతో వ్యవహరిస్తారు.

పాపాత్ములు పుణ్యాత్ములవలె దురాచార సంపన్నులవలె శిష్టాచార సంపన్నుల వలె నటిస్తారు.

"మ్లేచ్ఛ శాస్త్రం పఠిష్యన్తి స్వశాస్త్రాణి విహాయతే
బ్రహ్మక్షత్ర విశాం వంశాః శూద్రాణాం సేవకాః కలౌ" [1]

**యువత:** పదహారేండ్ల వయసు గల వారి శిరోజాలు సహితం తెల్లబడ గలవు.

ఇరవై సంవత్సరాలకే మానవులలో వృద్ధాప్యం ప్రవేశిస్తుంది.

యువకులు అల్పాయుష్కులై జరావస్థ పొందగలరు.

కొందరు కన్యలను అక్క చెల్లెళ్లను జారవృత్తికి అలవరచి జీవనోపాధి పొందుతారు.

పురుషులు కన్యాగాములు, భ్రాతృ జౌగాములు అగమ్యాగాములై చరించగలరు.

---

1. శ్రీ మదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణము, ప్రకృతి ఖండం, 7వ అధ్యాయం, పుట 25



స్త్రీ పురుషులను నిర్ణయించుట కష్టం కాగలదు.

అందరూ ఒకేవిధంగా అలంకరించుకొని దుర్వ్యవహారాలను చేపట్టగలరు.

సర్వత్ర పురుషులు స్త్రీలు వామనులై వ్యాధి యుక్తులై పరితపింపగలరు.

నీచులు ధనవంతులై శ్రేష్ఠులుగా పరిగణింపబడుదురు.

నగర వాసులు హింసకులై నిర్దయులై మనుష్యఘాతకులు కాగలరు.

జనులు రోగగ్రస్తులై అల్పాయువుతో అచిరకాలంలోనే యౌవన రహితులవుతారు.

లక్ష మందిలో ఒక పుణ్యాత్ముడు లభింపడు.

లంపటులు జితేంద్రియుల్లా, పుంశ్చలీ స్త్రీలు పతితల్లా, హంతకులు తపస్వుల్లా, వైష్ణవులు విష్ణుభక్తుల్లా కాపట్యంతో పూజలందుకుంటారు. కీర్తి కొరకే దానం చేస్తూ, దానం చేసిన పదార్థాలను మళ్ళీ పరిగ్రహింపగలరు.

**పంటలు:** మేదిని క్రమంగా సస్యహీన కాగలదు.
వృక్షాలు ఫలహీనాలై స్త్రీలు పతిహీనులై
గోవులు క్షీరహీనాలై శేషించగలవు.

క్రమంగా వృక్షాలు హస్త ప్రమాణం కాగా, మానవులు వామనులై అంగుష్ఠ ప్రమాణ మాత్రులు కాగలరు. ప్రజలు మేధస్సును ప్రసాదించు నవనీతం లేని క్షీరాలను సేవిస్తారు. ఇతరుల జీవనాధారాలను హరించువారు, వృషభాది జంతువులను హింసించేవారు, ధావకులు వృద్ధి పొందగలరు.

ఈ విధంగా యావత్ప్రపంచం మ్లేచ్ఛావరణంతో నిండి ఉన్న సమయంలో విష్ణుయశుడనే బ్రాహ్మణునికి శ్రీ మన్నారాయణుని కళాంశంతో కల్కి మూర్తి అవతరింపగలడని, అతడు పాపులందరిని సంహరించి మ్లేచ్ఛరహితం చేసి

అంతర్ధాన మవుతాడని, యుగాంతంలో దుర్మార్గులు జన్మించి భూమిని ఆక్రమిస్తారని కలియుగం అంతరించి కృతయుగారంభం కాగలదని బ్రహ్మావైవర్త పురాణం తెలియజేస్తుంది.

## 6.3.2 విష్ణు పురాణం

ధర్మార్థ పురుషార్థాలు క్షయించి జగత్తు నశిస్తుంది.
ధనమే కుల కారణం (ధనమున్నవాడు ఉత్తమ కులీనులు).
అభిరుచి దాంపత్య కారణం-అభిరుచి రేవ దామ్పత్యసంబన్ద హేతుః.
స్వీకరణమే వివాహ హేతువు.
స్త్రీత్వం భోగ కారణం - స్త్రీత్వమేవోప భోగహేతుః.
అనృతమే వ్యవహార జయహేతువు.
అన్యాయమే జీవన కారణం.
దౌర్భల్యమే ఆవృత్తి కారణం.
జందెమే విప్రత్వ హేతువు.
స్నానమే సాధన హేతువు.
ఉదకమే తీర్ధ హేతువు.
ఉదక సమృద్ధియే పృధివీ హేతువు.
రత్నాలు సువర్ణాది ధాతువులు శ్లాఘ్యుడగుటకు కారణం.
బీదరికమే సాధుత్వ హేతువు.
సద్వేష ధారియే దానపాత్రం.
కపట వేషమే మహత్వానికి హేతువు.
ప్రగల్భముగ పలుకుటే పాండిత్య కారణం.

శ్రీ విష్ణు మహాపురాణంలో భవిష్య రాజ వంశాలను గురించి వివరిస్తూ

1. శ్రీ విష్ణు మహాపురాణం, కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులు,చతుర్ధాంశం, చతుర్వింశోధ్యాయము, 1984, పుట 349.



ఇక్ష్వాకు వంశం, మగధ రాజవంశం, మౌర్య, శుంగ, ఆంధ్ర, అభీర, నాగ వంశాలను గురించి పరాశరుడు వర్ణించాడు.

"తస్సాప్యశోక వర్ధనస్తత స్సుయశాః తతశ్చ దశరథ
స్తతశ్చ సంయుతస్తత శ్శాలిశూక స్తస్మాత్". [1]

అతి లుబ్ద పాలకులను సహింపలేక ప్రజలు కొండల గుట్టల లోయలం బట్టి పోయి తలదాచుకొంటారు. కల్లు, ఆకుకూరలు, దుంపలు, పండ్లు, ఆకులు పువ్వులు తింటారు. చెట్ల పట్టాలు, ఆకులు కట్టుకుంటారు. పిల్లలను కంటారు. శీత వాతాతప వర్షాల కోర్చుకుని బ్రతుకుతారు. ఇరవై మూడేండ్లు ఎవ్వరూ బతకరు. సకల జనం ఈ కలియుగంలో తరిగిపోతారు.

## 6.3.3 మత్స్య పురాణం

శ్రీ మత్స్య పురాణంలో సూతుడు ఋషులకు ద్వాపర కలియుగాల స్వరూపాన్ని తెల్పాడు. అందులో ద్వాపరయుగ లక్షణాలు:

ద్వాపరయుగంలో ప్రజలలో లోభం భృతి (వేతనంతో పని చేస్తారు). వాణిజ్యం, యుద్ధం, తత్త్వం నిశ్చయం చేయలేరు.

విహిత కర్మలు చేయకపోవుటం - నిషిద్ధ కర్మలను ఆచరించటం, బాటసారులను చంపటం. దురభిమానం, దర్పం లేకుండటం, బలానికి ప్రాముఖ్యం అధికమవటం, రజస్తమోగుణ ప్రవృత్తులధికమవటం, అధర్మం వ్యాకులత చెందటం, మన్వంతరం నాటి మేధావులను తిరస్కరించేవారు జన్మించటం యుగధర్మంగా కనిపిస్తుంది.

మనో వాక్కాయిక కర్మలతో ఎంతో శ్రమపడిన తర్వాతగాని లోకయాత్ర జరగదు.

వర్ణ వ్యవస్థ ధ్వంసం అవుతుంది.

వర్ణ ధర్మాలు, బ్రహ్మ చర్యాశ్రమాల ధర్మాలు సంకీర్ణమౌతాయి.

(ఒకదాని ధర్మంలో ఒకటి కలిసి పోతుంది.)

శ్రుతి, స్మృతులు రెండూ అభిప్రాయ భేదాలనిస్తుంది.

యజుర్వేదం ద్విధాభావాన్ని పొందుతుంది.

ఋషులు దృష్టిభేదాల ననుసరించి వేదసంప్రదాయాల విషయంలో భిన్నార్థ ప్రకాశనం చేస్తారు.

## కలియుగ లక్షణాలు :-

**సమాజం :** మనోవాక్కాయ కర్మలతో లోకయాత్ర జరుగునో లేదో చెప్పలేం.

ప్రాణులకు అధికంగా మరణప్రదం.

ఎల్లప్పుడు రోగం, ఆకలివల్ల భయం, అనావృష్టి భయం, దేశోపద్రవం ఉంటుంది.

ప్రజలు దీనిని ప్రమాణంగా గ్రహించరు.

గర్భస్థులుగా, యౌవనస్థులుగా, కౌమారంలో, వార్ధక్యంలో ప్రజలు అనేక వయోదశలలో మరణిస్తారు.

ప్రజలకు తేజోబల అల్పులు, మహాకోపులుగా, అధార్మికులుగా ఉంటారు.

అబద్ధ మాడటమే ప్రజల వ్రతం.

ప్రజలు లోభపరులు, వారి యజనాలు, అధ్యయనాలు, ఆచారాలు, ఆగమాలు సరియైనవి కావు.

ప్రజలలో హింస, దురభిమానం, ఈర్ష్య, క్రోధం, మాయ, ఓర్పు, నిబ్బరం లేకపోవటం కనిపిస్తుంది. లోభం, మోహం అన్ని విధాల వ్యాపిస్తుంది.

ప్రజలందరు దుఃఖంలో మునిగిపోతారు.

వీరి పరమాయువు నూరు సంవత్సరాలు.



దేశభక్తుల వేషాలు ధరించిన లోకవంచకులు లోకనాశకులు, ధర్మాన్ని పాడుచేసేవారు కొందరు దివారాత్రులు వృత్తి నిమిత్తం వేదాధ్యయనం చేసినట్లు నటిస్తారు.

స్త్రీ బాల గోవధ పరస్పర వధలు జరుగుతాయి. స్వార్థానికై పరస్పరోపకారం చేస్తారు.

దుఃఖ ప్రాచుర్యం, అల్పాయువు, ప్రజలు దేశాలు వదిలిపోవటం, రోగాలు పొందటం, అధర్మంలో అభినివేశం, శిశుహత్య, ఆయుర్బల రూప హాని అధికమవుతుంది.

బ్రాహ్మణులు ఆచరించే కర్మలలో దోషాల ప్రభావంతో భయపడతారు.

బ్రాహ్మణులు వేదాధ్యయనం చేయరు. యాగమనుష్ఠించరు. విప్రులు, క్షత్రియులు, వైశ్యులు మానసికమైన నాశస్థితి పొందుతారు.

శూద్రులకు బ్రాహ్మణులతో వేదం, కామ ప్రవృత్తి, పడక-భోజనం, కలిసి కూర్చుండుట మొదలైనవిషయాలతో సంబంధం ఏర్పడుతుంది.

శూద్రులు రాజులవుతారు.

శూద్రులు వేదాధ్యేతలుగా, ధర్మార్థకోవిదులు అవుతారు.

వేదశాస్త్రాలలో ప్రామాణ్య బుద్ధిలేని ప్రవృత్తులధికమవుతాయి.

కేవలం ధర్మవ్యవస్థా పరిరక్షణలో అడ్డుకట్టలా ఉండే యజ్ఞాలు నశిస్తాయి.

సామాజిక స్వరూపాన్ని వర్ణవ్యవస్థ, వేదవాఙ్మయ పరిణామాలను వివరించారు. హింస, చౌర్యం, అనృతం, మాయ, తపస్వుల వధ కలియుగ ప్రజలు ప్రవృత్తులుగా సాధిస్తారు. ధర్మం నశిస్తుంది.[1]

విప్రుల ప్రవృత్తి దోషాలు ప్రజల క్షేమ, హానులకు హేతువులని కలియుగ

1. శ్రీ మత్స్య మహాపురాణం, 143 అధ్యాయం, శ్రీ పాతూరి సీతారామాంజనేయులు, శ్రీ వెంకటేశ్వర ఆర్ష భారతి ట్రస్ట్, హైదరాబాదు, 1986, పుట 552-555.

ధర్మప్రవృత్తి స్వరూపాన్ని తెలియజేస్తుంది. వేదాల స్వరూపం, వేదాధ్యయన స్వరూపం, వర్ణవ్యవస్థలో మార్పులు ప్రజల ప్రవృత్తులలో మార్పులను ప్రధానంగా సూచించారు.

### 6.3.4 నారదీయ పురాణం :

స్త్రీలు ప్రమదలై భర్తలుండి కూడా అన్య పురుష స్పృహతో ఉంటారని, దీనహీనులైన భర్తలను లెక్కచేయరని, యువతులు ముదిసిన అత్తమామలను చూడరని, పాపబుద్ధి అతిక్లేశమని (గుణవతులైన భార్యలను లెక్కచేయక పరదారానురక్తులై పతులు పతితులవుతారని) నారదీయ పురాణం కలియుగ ధర్మాన్ని సూచిస్తుంది.

భరతాది విద్యలే కాని వేదశాస్త్ర పురాణ ఆధ్యాత్మిక విద్యలు సంభవింపవు శ్మశాన దేవతార్చనం శ్రేయస్కరమని పాటిస్తారు. హరిస్మరణ చేయరు. రాజ సేవోన్మత్తులైన బ్రాహ్మణులు విష్ణు భక్తి పరాయణులు పలికిన మాటలను ఆక్షేపిస్తారు.[1]

### 6.3.5 భవిష్య మహాపురాణం

వ్యాసుడు రచించిన పద్దెనిమిది పురాణాలలో భవిష్య మహాపురాణం ఒకటి. రాబోవు కాల చరిత్ర వర్ణితమయింది. 'చతుర్దశ సహస్రాణి తథా పంచశతానిచ' అని అనటం వలన బ్రహ్మ పర్వంలో నవీన ఖగోళ విజ్ఞానంతో సూర్యకిరణ శాస్త్రాన్ని సమన్వయించి భౌతికాభౌతిక ప్రయోజనాలను తెలియజేస్తుంది. సూర్యభగవానుని వర్ణన, పూజావర్ణన, సూర్య ద్వాదశ మూర్తి వర్ణన, వ్రతాలు, దేవతా ప్రతిమల లక్షణాలు, ధర్మ స్వరూపం, వాస్తుపూజా విధానం. భౌతిక

1. నారదీయపురాణం, అల్లాడు నరసింహ కవి, పరిశోధన రచన : డా॥వడ్లమూడి గోపాలకృష్ణయ్య, పుట, 174. ప్రచు:- డైరెక్టర్, ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంటు ఓరియంటల్ మాన్యు స్క్రిప్ట్స్ లైబ్రరీ అండ్ రిసర్చ్ ఇన్స్టిట్యూట్, హైదరాబాదు - 1976.



కథలు, కల్క్యవతార వర్ణన, దేశకాల పరిస్థితులు వివరింపబడ్డాయి. ఈ పురాణం 14,500 శ్లోకాలతో కూడి ఉంది. భవిష్య మహాపురాణం పేరుతో మూడు రకాలయిన గ్రంథాలున్నాయి. అవి: బ్రాహ్మం, మధ్యమం, ప్రతిసర్గం, ఉత్తరం అని నాలుగు పర్వాలున్న గ్రంథం ఒకటి; బ్రాహ్మం, వైష్ణవం, శైవం, త్వాష్ట్రం, ప్రతిసర్గం అని ఐదు పర్వాలున్న గ్రంథం ఒకటి; బ్రాహ్మ, వైష్ణవ, శైవ, సౌర, ప్రతిసర్గ మనే ఐదు పర్వాలున్న గ్రంథ మొకటి.

మధ్య పర్వంలో వాస్తు శాస్త్రం, దోషాలు, ఎరువులు, ఉద్భిజ్జ విద్యకు (బోటనీ) సంబంధించిన విషయాలు, ఔషధాలు, శిల్పవిద్య, శిల్పుల వేతనాలు వివరించబడ్డాయి. బ్రహ్మాండోత్పత్తి లోకపరిణామాలు పేర్కొన బడ్డాయి. ప్రతిసర్గలో వైవస్వత మన్వంతరంలోని రాజుల చరిత్రలు, పాలన, కలియుగం మొదలైన అంశాలున్నాయి.

కులం చెడి రాజ్యం పోయి భ్రష్టుడైన కలి కృష్ణుని ఆశ్రయించగా 'ఓ కలీ! నేను నిన్ను రక్షించుటకు 'మహావతి' యందు జన్మింతును. నా యంశము భూమిపై నవతరించి మహాబలులయిన యగ్ని వంశీయులను నశింపజేసి మ్లేచ్ఛ రాజులను స్థాపించును' అని పలికి అంతర్ధాన మవుతాడు.[1]

భగవంతుని అవతరణ భక్తికి ముక్తికి మాత్రమే కాదు సమాజ హితానికి, ఐక్యతకి, కుటుంబ జీవన ధర్మానికి, వ్యవస్థకి, ఉన్నత సందేశానికి, ప్రజలు భవిష్యత్తును సుఖశాంతులతో వర్ధిల్ల జేసుకోవటానికి వర్తిస్తుంది.

లోక కల్యాణం కోసమే జగజ్జనని శ్రీదేవి అవతరించింది. దేవేంద్రుడు, శ్రీ విష్ణువు, దేవకి నమస్కరించి ఈ జగత్తును సృజించటానికి, పాలించటానికి నీవు ఒక్కర్తివే సమర్థురాలవని, కిరాతకులైన క్ష్మానాథుల దౌష్ట్యాన్ని సహించలేక

1. భవిష్య మహాపురాణం, కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులు, విజయవాడ, 1954, పుట 184, 185..

ఈ ధాత్రి కంపించిపోతుందని, వారిని సంహరించి భూభారాన్ని వహించమని ప్రార్థిస్తారు. జరాసంధాది దుష్ట మహీపతులందరిని వధిస్తానని, భూభారాన్ని వహించేందుకు అవతరిస్తానని పలికి యోగమాయ అంతర్ధానమయ్యింది అనే విషయం మార్కండేయ పురాణంలోను వివరింపబడింది.

## 6.3.6 శ్రీ దేవీ భాగవతం

'భావి యెఱిగి సెప్ప బ్రహ్మతరము గాదు' [1]

బ్రహ్మ వైవర్త మహాపురాణంలో శ్రీ కృష్ణుడు లోక కళ్యాణం నిమిత్తం దుర్గను అర్ధాంగిగా స్వీకరింపమని ఆదేశిస్తాడు. శివుని పతిరూపంలో పొందగలవు. కల్ప విశేషంలో దక్షకన్యవై సతీరూపంలో గృహిణివి కాగలవు. హిమవంతుని పుత్రికవై పార్వతిగా ప్రఖ్యాతి చెంది, శివునికి అర్ధాంగివి కాగలవు. సమస్తలోకాలలోని భక్తులు నిన్ను పూజిస్తారు. గ్రామాలలో నగరాలలో నీల గ్రామదేవతవై పూజింపబడతావు అని సింహవాహిని అయిన దుర్గనాదేశిస్తాడు. [2]

## 6.3.7 మార్కండేయ పురాణం

దేవతలకు దేవి తన భవిష్యదవతారాలను తెలియజేస్తుంది. వైవస్వత మన్వంతరంలో ఇరవై ఎనిమిదివ మహాయుగంలో నందగోపకులంలో ఆవిర్భవించి శుంభ నిశుంభలను సమయించి వింధ్యాచలంలో వసిస్తాను కాబట్టి వింధ్య వాసినిగా వ్యవహరిస్తారని, వైప్రచిత్తాది దైత్యులను భక్షించి రక్తదంతిగాను, జగాలు నిర్జలాలై

1 దాసు శ్రీరాములు శ్రీ దేవీభాగవతం వి-112. సూక్తి సుధాకరము, సం॥ పెనుమత్స సత్యనారాయణ రాజు, 1963, పుట 646.

2. శ్రీ మదాంధ్ర బ్రహ్మావైవర్త మహాపురాణము, శ్రీ మట్టుపల్లి శివసుబ్బరాయ గుప్త, గుంటూరు, 1978, పుట 33.



ఉండగా అయోనిజనై ప్రభవించి నన్నభినందించిన మునులను శత నేత్రాలతో ఆలోకించి శతాక్షిగాను, అశేషలోక శరీరసంభూత శాకాహారాల భరియించి శాకంభరి అని, దుర్గముడనే దుష్టాసురుని జంపి దుర్గ అని, సకల లోకాపకారి అయిన వరుణుడనేవాడిని భ్రమర్యాకారంలో పరిమార్చి భ్రామరీ అని ప్రఖ్యాతి వహిస్తాను. దనుజ బాధ వర్తిల్లినప్పుడెల్ల జన్మించి వివిధ నామాలతో అవతరించి భువనాన్ని రక్షిస్తానని తన అవతార రూపాలను దేవతలకు తెలియజేస్తుంది. [1]

## 6.3.8 శ్రీ మహాభాగవత పురాణం

ద్వాదశస్కంధంలో భవిష్యన్నరపాల రాజ్య పాలనాకాల నిర్ణయం వర్ణింపబడింది. నిఖిల పురాణ వైఖరి సమేతుడైన సూతుడు పరీక్షిన్మహారాజుకు శుక మహర్షి నారాయణ కథా ప్రపంచాన్ని, తద్గుణాలని, ఆచారవిధి, జీవాత్మ భేదం, హరి పుజావిధానం, జ్ఞానయోగం మొదలైన వాటినిగురించి చెప్పి భావి కాలగతులను వరుసగా పరికించి చెప్తానని భవిష్య రాజ వంశాలను గురించి వివరించాడు. రాజులతో బాటు యుగ ధర్మాలగురించి, ప్రళయ కాలాన్ని గురించి, కాల ప్రభావాన్ని గురించి వివరిస్తాడు.

రాజులకు రాజ్యసంపద అశాశ్వతమని, మానవ నాథులు కాలం అతి చంచలమని ఎరుగక అతిమోహం విడువలేక పరిపాలనాధికారంలోనే అణగి భ్రాంతి మతులవుతారని విష్ణువును సేవించినవారికి హరిభక్తి ఒక్కటే మార్గమని సూచిస్తాడు. [2]

1. మార్కండేయ పురాణం, మారన, సంపాదకులు జి.వి.సుబ్రహ్మణ్యం ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి, 1984. పుట 383.

2. శ్రీ మహాభాగవతము, ద్వాదశ స్కంధం, పోతన, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు 1986, పుట 770.

రాజులు గర్వాంధులై మాత్సర్యంతో పరిపాలిస్తారు. యువకులు బాహ్లిక దేశాధిపతులవుతారు. శూద్రులు, మ్లేచ్ఛులు, బ్రహ్మతేజో హీనులయిన బ్రాహ్మణులు భూభాగాలను పరిపాలిస్తారు. వీరు రాజరూపుగల మ్లేచ్ఛులై ధర్మ సత్యదయా హీనులై క్రోధ మాత్సర్యాలతో, స్త్రీ బాలగో ద్విజాతులను వధించటానికి వెనుకాడక, పరధన స్త్రీ వ్యామోహ పేతులై రజస్తమో గుణరతులై, అల్పజీవులై, అల్ప బలులై, హరిచరణారవింద మకరంద రసాస్వాదులుగాక తమలో అన్యోన్య వైరానుబంధులై సంగ్రామ రంగంలో హతులవుతారు.

ధర్మం అడుగంటుతుంది, ధనవంతుడే ధరిత్రి నేలుతాడు. కలిమి బలిమి కలవాడే రాజు. బలవంతుడైనవాడే కులహీనుడైనా దొడ్డ గుణవంతుడవుతాడు. రాజులు చోరులై సంచరిస్తూ అధర్మ ప్రవర్తనులై వర్ణా శ్రమ ధర్మాలను వదలి శూద్ర ప్రాయులై ఉంటారు. ప్రజలు లోభులై జారత్వచోరత్వాదులతో ద్రవ్య హీనులై వన్యశాకమూల ఫలాలను భుజిస్తూ వన దుర్గాలలో కృశీభూతులై ఉంటారు.

మేఘాలు జలశూన్యాలు; సస్యాలు నిస్సార మవుతాయి. ధర్మమార్గం లేకున్న ముకుందుడు దుష్టనిగ్రహ శిష్ట పరిపాలనం కోసం శంబల గ్రామంలో విష్ణుయశుడనే విప్రునికి పుత్రత్వం పొంది కల్కి అవతారుడై దేవదత్త ఘోటకారూఢుడై దుష్ట మ్లేచ్ఛ జనాలను ఖండిస్తాడు. 'కాలంబు జాడ యెవ్వరికిం గానరాదు'[1] అని కలియుగ పరిణామాలను వివరించారు.

పురాణాల్లో పేర్కొన్న రాజవంశ క్రమంలో ఏక రూపత కనిపిస్తుంది. పాలకుల పేర్లలో, పరిపాలనా కాల క్రమంలో భేదం కనిపిస్తుంది. రాజ సంఖ్యకు ఇచ్చిన వివరణ వివాద గ్రస్తంగా ఉండటం గమనించదగిన అంశం. మనువు

1. శ్రీ మహాభాగవతము, ద్వాదశ స్కంధం, పోతన, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు 1986, పుట 773.



నుండి భరతుని వరకు రాజుల వంశవృక్షాల్ని పురాణాలు అందిస్తున్నాయి. చారిత్రక రాజవంశాల ప్రస్తావన కొద్ది మాత్రమే కనిపించినా వివాదగ్రస్తమైన అంశాలు అధికంగా కనిపిస్తాయి.

కాళిదాసు విరచితమైన మాళవికాగ్ని మిత్రమ్ నాటకంలో పుష్యమిత్రుడు అతని కుమారుడు అగ్నిమిత్రుడు, అతని కుమారుడు వసుమిత్రుడని విదితమవుతుంది. సుజ్యేష్ఠుడనే పాత్ర కనిపించదు. పురాణాల ఆధారంగా చూసినట్లయితే అగ్నిమిత్రుని మనుమడు వసుమిత్రుడు. పునరాలోకనం చేయవలసిన అంశాలివి.

సూర్యచంద్ర వంశస్థులయిన హైహయ, ద్రుహ్య, తుర్వసు, కన్యాకుబ్జ, పౌరవ, కాశీ, అయోధ్య, విదేహ, వైశాలీ రాజవంశాలతో వంశవృక్షాన్ని పురాణాలు వివరించాయి.“పురాణాలు గుప్తుల తరువాతి కాలంలో రాయబడినవనే విషయంలో కూడా చారిత్రకులు ఏకాభిప్రాయాని కొచ్చారు”.[1]

'మౌర్యుల గురించి (అశోకుడు తప్ప) విష్ణుపురాణం, గుప్తుల గురించి వాయుపురాణం నిజానికి కొంచెం అటూ ఇటుగా ఉండటం చారిత్రకవేత్తలకు కొంత ఉపశమనం కలిగించిన మాట కూడ నిజమే”.[2] విష్ణుపురాణం అశోక చక్రవర్తిని విస్మరించిందని రచయిత పేర్కొన్నారు. శ్రీ విష్ణు మహాపురాణంలో

'కౌటిల్య ఏత చన్ద్ర గుప్తముత్పన్నం రాజ్యేభిషేక్ష్యతి
తస్సాపిపుత్రో బిన్దు సారో భవిష్యతి
తస్యాప్యశోక వర్ధన స్తతస్సు యశాః తతశ్చ
దశరథ స్తతశ్చ సంయుత స్తతశ్శాలిశూకస్త స్మాత్సో'[3]

1&2 మిసిమి, పురాణాలు మరచిన మహా సమ్రాట్టు అశోకుడు, డా॥ ఈమని శివనాగి రెడ్డి, మే, పుట 141.

3. శ్రీ విష్ణు మహాపురాణము చతుర్థాంశము, చతుర్వింశోధ్యాయము, 28, 29, 30, పుట 349.

అశోక వర్ధనుని ప్రస్తావన గమనించదగినది. భిన్న వ్యాఖ్యానాలకు ఉదాహరణగా 'ఆ సమయంబున బృహద్రథుని సేనాపతియగు పుష్యమిత్రుడు, శుంగాన్వయుడతని వధించి రాజ్యంబుగైకొను. అతనికి నగ్ని మిత్రుండును నరపతి పుట్టగలవాడు. వానికి సుజ్యేష్ఠుడును, సుజ్యేష్ఠునకు వసుమిత్రుండును, నతనికి భద్రకుండును, భద్రునకు పుళిందుడును, నా శూరునకు ఘోషుండును, వానికి వజ్రమిత్రుండును, అతనికి భాగవతుండును, వానికి దేహహూతియు జనించెదరు'.[1] అని వివరించారు.

'పుష్యమిత్రస్సేనాపతి స్స్వామినం హత్వారాజ్యం కరిష్యతి॥ తస్యాత్మజోz గ్నిమిత్రః॥ తస్మాత్సు జ్యేష్ఠస్తతో వసుమిత్ర స్తస్మాదప్యుదఙ్క స్తతః పులిన్దక స్తతో ఘోషవసు స్తస్మాదపి వజ్రమిత్రస్తతో భాగవతః ॥ తస్మాద్దేవ భూతిః ॥' [2]

రాజుల చరిత్రను సత్యాలతో శాసనాధారాలతో పోల్చిరాస్తే వ్యత్యాసంగా కనిపిస్తుంది. ఉదాహరణకు పుష్యమిత్రుడు అతని కుమారుడు అగ్నిమిత్రుడు, అతని కుమారుడు సుజేష్ఠుడు, అతని కుమారుడు వసుమిత్రుడని పురాణాలు తెలియ జేస్తున్నాయి. భాగవత విష్ణు పురాణాలలో ఈ అంశాలను గమనించవచ్చు.

1. శ్రీ మహాభాగవతము, పోతన, ద్వాదశ స్కంధము, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1986, పుట 769.
2. శ్రీ విష్ణుమహా పురాణం, ఆంధ్రానువాద సహితము, అనువాదం శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులు, 1984, పుట 352.



పురాణాలలో అరంభంలో కనిపించే రాజుల పేర్లు చరిత్రలో అధిక శాతం కనిపించవు కాని క్రమేపి పురాణాల్లోని రాజుల పేర్లు అధిక శాతం చరిత్రలోని పేర్లను పోలివున్నాయి. పురాణాలు రాజుల పేర్ల నుండి రాజ వంశాలను పేర్కొన్నాయి. పురాణాల్లో కేవలం మత, ధార్మిక అంశాలే కాక బంగారు, రత్న, వెండి, స్పటిక, కంచు లోహకరులకు ఇచ్చే వేతనాలను, రైతు, చాకలి, మంగలి, పత్ర రచన కారులు, మాల కారులు, నేత కారులకు ఇచ్చే వేతనాది నిర్ణయాలను పురాణాలు తెలియజేస్తున్నాయి. పురాణం అనే పదం కూడ వేతనమే. ( పదునారు పణములు ఒక పురాణం).
పురాణాలలో వ్యవసాయానికి సంబంధించిన అనేక విషయాలను పేర్కొన్నారు. సామాన్య విశేష దోహదాలను వివరించారు.